1St Year Happy Work Anniversary.

షణ్ముఖ

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health — Best for Readers — THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 44 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 14 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 44 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Saturday 14 February 2026 PAGES : 8 PRICE : 3/-


## ఫీజు రీయింబర్స్‌మెంట్ పై మండలిలో రచ్చ.. వాకౌట్ చేయడం తమకు ఫ్యాషన్ కాదన్న బొత్స



ప్రభుత్వంలో మార్పు వస్తుందనే వాకౌట్ చేస్తున్నామన్న బొత్స

ఫీజు రీయింబర్స్‌మెంట్ 8 విడతల బకాయిలు ఉన్నాయన్న వైసీపీ ఎమ్మెల్సీ భరత్

గత ప్రభుత్వం రూ.4,064.59 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిందన్న లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 13)

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రచ్చ మొదలైంది. ప్రభుత్వం అసత్యాలు మాట్లాడుతోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఫైర్ అయ్యారు. తమకు వాకౌట్ చేయడం ఫ్యాషన్ కాదని, అలా చేస్తే అయినా కూటమి ప్రభుత్వంలో -మిగతా 2లో

## తిరుమలలో అపచారాలకు నాటి పాలక మండలే కారణం: పవన్ కల్యాణ్



రూ.10 కోట్లతో నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్

పాలకమండళ్లు బాధ్యతగా ఉంటే ఆలయాల్లో అపచారాలు జరగవని వ్యాఖ్య

గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో అనేక తప్పులు జరిగాయని విమర్శ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 13)

పాలక మండళ్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే దేవాలయాల్లో ఎలాంటి అపచారాలు, తప్పులు జరగవని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల వంటి పుణ్యక్షేత్రంలోనే ఎన్నో అపచారాలు జరిగాయని, నాటి పాలక మండలి సరిగ్గా పనిచేసి ఉంటే -మిగతా 2లో

# నాలాగే ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారు...

## ప్రజలు అన్నీ గమనించి తీర్పు ఇచ్చారు



- గత పాలనలో భూ వివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయన్న సీఎం
- 2026 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేపడతామని వెల్లడి
- తిరుపతి లడ్డూ వివాదంలోకి హెరిటేజ్‌ను లాగి బ్రాండ్ దెబ్బతీశారని ఆగ్రహం
- ప్రత్యర్థిని ఆర్థికంగా దెబ్బతీయడమే ఫ్యాక్షనిస్టుల లక్ష్యమని వ్యాఖ్యలు
- దేవాలయాల పవిత్రతను కాపాడతామని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 13)

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, పాలకులు అసెంబ్లీలో తనను అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే 2019-24 మధ్య ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారని, ప్రజలు అన్నింటినీ గమనించి సరైన సమయంలో తీర్పు ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై -మిగతా 2లో

## 'వందేమాతరం' పూర్తి గీతాన్ని పంచుకున్న విజయసాయిరెడ్డి... కీలక వ్యాఖ్యలతో ట్వీట్!

పూర్తి 'వందేమాతరం' పాడాల్సిందేనన్న విజయసాయిరెడ్డి

సగం గీతం పాడటం బానిసత్వమేనని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 13)

ఇప్పటివరకు మనం పాడుతున్న వందేమాతరం గీతం సగమేనని తెలుసా?... అయితే పూర్తి గీతం ఎలా ఉంటుందో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పంచుకున్నారు. వందేమాతరం' పూర్తి గీతాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు పాడిన సగం గీతం బానిసత్వానికి నిదర్శనమని, ఈ దుస్థితిని మార్చి పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ సమర్థించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయసాయి తన అభిప్రాయాన్ని వివరిస్తూ, "విదేశీ పాలకులు వెళ్లిపోయినా, -మిగతా 2లో

## నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు: సీడీఎస్




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 13)

స్వాతంత్ర్యం తర్వాత భారత్-చైనా సంబంధాల గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కోసమే అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1954లో పంచశీల ఒప్పందం చేసుకొని ఉంటారన్నారు. దేహ్రాదూన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎస్.. భారత్-చైనా చారిత్రక సంబంధాలపై ప్రసంగించారు. ఆ ఒప్పందంలో భాగంగానే టిబెట్‌ను చైనాలో భాగమని భారత్ గుర్తించిందన్నారు."బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత.. సరిహద్దుల్ని నిర్ణయించుకునే అవకాశం భారత్‌కు వచ్చింది. తూర్పున మెక్‌మోహన్ రేఖ , లద్దాఖ్‌లోని ప్రాంతాల గురించి నెహ్రూకు అవగాహన ఉండి ఉండొచ్చు. కానీ, దీని (టిబెట్ సరిహద్దు ప్రాంతంలో)పై కాదు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందంపై ముందుకెళ్లారని భావిస్తున్నా.ఇదే చైనీయుల విషయానికొస్తే.. టిబెట్‌కు విముక్తి కల్పించిన తర్వాత వారు సరిహద్దుల నుంచి లాసా (టిబెట్‌లోని నగరం), షిన్‌జియాంగ్ వరకు వెనక్కి వెళ్లిపోయారు. ఈ ప్రత్యేక ప్రాంతం రెండు దేశాలకు ఎంతో ముఖ్యమైనదిగా మారింది. అందుకే చైనీయులు ఇక్కడ స్థిరత్వాన్ని కోరుకున్నారు. ఆ సమయంలో భారత్ కూడా చైనాతో మంచి సంబంధాలు కొనసాగించాలని భావించింది. -మిగతా 2లో

## ఐటీ రాబడి పెరగడమంటే భారం మోపినట్లు కాదు: నిర్మల



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 13)

వ్యక్తిగత ఆదాయపు పన్ను (ఐటీ) రాబడి పెరగడాన్ని మధ్యతరగతిపై భారం మోపుతున్నట్లు భావించరాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. "దేశంలో మధ్యతరగతి వర్గం విస్తరిస్తోంది. వారిపై భారం మోపుతున్నామనడానికి ఆధారాల్లేవు. కార్పొరేట్ల కంటే వ్యక్తుల నుంచి ఎక్కువ ఐటీ వస్తున్నంతమాత్రాన ప్రజలపై అధిక భారం పడుతున్నట్లు కాదు. మధ్యతరగతి విస్తరిస్తోంది. పన్నులు చెల్లించడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. గత 11 ఏళ్లలో ఐటీ చెల్లింపుదారులు 5.26 కోట్ల నుంచి 12.13 కోట్లకు పెరిగారు. రూ.12 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్నవారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక అణచివేత ఎక్కడుంది?" అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాల కోసం రాష్ట్రాలకు ఇచ్చే నిధులను నిలిపివేయట్లేదని, ఏ రాష్ట్రంపైనా ఎలాంటి పక్షపాతం లేదని స్పష్టంచేశారు. నిధుల కేటాయింపుల్లేకుండానే వివిధ పథకాలను ప్రకటిస్తున్నామనే విమర్శల్ని తోసిపుచ్చారు. రుణభారంపై కాంగ్రెస్‌ది మొసలి కన్నీరేనని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు కేంద్రం కోత పెడుతోందన్న విమర్శల్ని మంత్రి తోసిపుచ్చారు. కేంద్ర నిధులంటే ఇష్టానుసారం వాడుకునే వీలున్న ఉచిత డబ్బు నిల్వలేమీ కాదని, అవసరం మేరకు వాటిని ఆచితూచి వినియోగించాలని చెప్పారు. దేశంలో ప్రస్తుతం -మిగతా 2లో

## గుంటూరు నుంచి విజయవాడకు 6 గంటలా?ప్రజలు నరకం అనుభవించాలా?: చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 13)



రాజకీయాల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్, వైకాపా నేతలను ఉద్దేశించి అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ నేత రోడ్డుపైకి వస్తున్నాడంటే ఏం జరుగుతుందోననే భయం ప్రజల్లో నెలకుంటోందన్నారు. "ఎక్కడికి వెళ్లినా దౌర్జన్యం, రోడ్డంతా బ్లాక్ చేయడం వంటివి చేస్తున్నారు. గుంటూరు నుంచి విజయవాడ వెళ్లాలంటే ఆరు గంటలా?ఆ సమయంలో -మిగతా 2లో

## నాకు కొన్ని విషయాలు వినపడవు

- అసెంబ్లీ లాబీలో బాలకృష్ణ, బొజ్జల, మంత్రి అనగాని మధ్య ఆసక్తికర చర్చ
- బొజ్జల బరువు తగ్గడంపై మంత్రి అనగానిని అడిగిన బాలయ్య
- ఇంకా తగ్గితే నాకు పోటీ వస్తావంటూ బొజ్జలకు సరదా హెచ్చరిక
- బాలయ్య, లోకేశ్ ను ఒకే ఫ్రేమ్‌లో చూడాలన్న బొజ్జల సుధీర్ రెడ్డి
- "నాకు కొన్ని వినపడవు" అంటూ బాలయ్య చమత్కారం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 13)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నేతల మధ్య ఆసక్తికర సంభాషణలు, సరదా సన్నివేశాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, శ్రీకాళహస్తి -మిగతా 2లో

## వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది: నారా లోకేశ్

వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్న మంత్రి

వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడి

ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదన్న మంత్రి నారా లోకేశ్

శాసనమండలిలో వైసీపీని నిలదీసిన నిలదీసిన మంత్రి నారా లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 13)



వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే వీటిపై చర్చించేందుకు రావాలని, తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని హితవు పలికారు. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై -మిగతా 2లో

# నాలాగే ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారు...

అధికారంలోకి రాగానే 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని గుర్తుచేశారు. "మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాకు అందిన ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలకు సంబంధించినవే. గత పాలకులు అడిగిన భూములు ఎవరైనా ఇవ్వకపోతే, వాటిని వెంటనే 22ఏ జాబితాలో పెట్టేసి వేధించారు. స్వయంగా చట్టాలు చేసిన ముఖ్యమంత్రే ఇలా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే బాధితులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాడేపల్లి ప్యాలస్ సమీపంలో హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం ఓ భూమి అడిగారు. అది ఇవ్వలేదని బలవంతంగా 22ఏలో చేర్చేశారు. రూ.33 లక్షలతో నిర్మాణం కోసం జీవో కూడా ఇచ్చేశారు. గత పాలకులు చేసిన పాపాలు కడగడానికే మాకు ఏడాది సమయం పట్టింది. మదనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తగులబెట్టడం వాళ్ల అరాచకాలకు నిదర్శనం. అందుకే, 2026 నాటికి ఈ రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి, ప్రతి ఒక్కరి భూమికి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించాం. భూములే కాదు, ఇసుకను కూడా వదలకుండా దోపిడీ చేశారు.

తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు పవిత్రంగా భావించే శ్రీవారి దర్శనం, ప్రసాదం విషయంలోనూ వాళ్లు రాజకీయాలు చేశారు. దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీయాలని ప్రయత్నించారు. జరిగిన తప్పులను మేం చెప్పకుండా ఉంటే, ఆ అపవిత్రతను కొనసాగించడానికి వాళ్లు వెనుకాడరు. అందుకే, టీటీడీ సహా అన్ని దేవాలయాల్లో పవిత్రతను కాపాడే బాధ్యతను మా కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

వివేకా హత్య కేసులో వాళ్లు ఎన్ని నాటకాలు ఆడారో అందరూ చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో రాసి, ఆ నేరాన్ని మాపై నెట్టాలని చూశారు. ఇప్పుడు అదే తరహాలో కల్తీ నెయ్యి వివాదాన్ని మా కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు అంటగట్టి, బ్రాండ్ ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాల్లో భాగంగా ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయడానికి చీనీ చెట్లను నరికివేసేవారు. ఇప్పుడు అదే ఫ్యాక్షన్ బుద్ధితో మా వ్యాపారాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో మేం కఠినంగా వ్యవహరిస్తాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు" అని చంద్రబాబు హెచ్చరించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పై మండలిలో రచ్చ.. వాకౌట్ చేయడం తమకు ఫ్యాషన్ కాదన్న బొత్స

మార్పు వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. తాము సమాధానాలు చెబితే వినాలని, అవాస్తవాలు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ, రూ.8,500 కోట్లు బకాయిలున్నాయని, కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.700 కోట్లు మాత్రమే చెల్లించిందని, ఇంకా రూ.7,800 కోట్లు పెండింగ్ ఉన్నాయని ఆరోపించారు. జగన్ హయాంలో బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించామని, కూటమి ప్రభుత్వం 8 విడతల బకాయి పెట్టిందని మండిపడ్డారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పందిస్తూ, వైసీపీ సభ్యులు అవాస్తవాలు చెబుతున్నారని, ఏ క్వార్టర్‌కు ఆ క్వార్టర్ చెల్లింపులు చేశామనడం అబద్ధమని అన్నారు. ఇప్పటివరకు రూ.1,859 కోట్లు చెల్లించామని, ఈ విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బకాయిలు పూర్తిగా క్లియర్ చేశామని వివరించారు. కాలేజీలకు ఇప్పటికే చెల్లింపులు చేసిన విద్యార్థుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని తెలిపారు.

బొత్స సత్యనారాయణ మళ్లీ స్పందిస్తూ, గత ప్రభుత్వం రూ.4,000 కోట్లు బకాయి పెట్టిందని చెప్పడం అసత్యమని, ఎన్నికల కోడ్ వల్ల ఒక్క క్వార్టర్ మాత్రమే పెండింగ్ అయిందని, అది కూడా అప్పటి ప్రతిపక్షం (టీడీపీ) ఈసీకి ఫిర్యాదు చేయడం వల్ల జరిగిందని అన్నారు. పెండింగ్ బకాయిలు ఎప్పటికి చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి నారా లోకేశ్ కౌంటర్ ఇస్తూ, బొత్స బకాయిలు లేవని చెప్పడం నిజం కాదని, రికార్డుల ప్రకారమే మాట్లాడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రూ.4,064.59 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిందని, అన్ని ఆధారాలు సభ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు.

# తిరుమలలో అపచారాలకు నాటి పాలక మండలే కారణం: పవన్ కల్యాణ్

ఆ పరిస్థితి వచ్చేది కాదని ఆయన విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా ఆలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు.

శుక్రవారం సచివాలయం నుంచి శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ

## మొదటిపేజీ తరువాయి

శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "మన ఆలయాలు నాగరికతకు, సంస్కృతికి, వారసత్వానికి చిహ్నాలు. వాటి పరిరక్షణ మనందరి బాధ్యత. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేతృత్వంలో ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం," అని అన్నారు. అరుణాచలంలో మాదిరిగా శ్రీకాళహస్తిలోనూ గిరిప్రదక్షిణ చేయాలన్న కోరిక తనకు ఉందని, త్వరలోనే క్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గనిర్దేశకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. దేవాదాయ శాఖ సహకారంతో రూ.40 కోట్లకు పైగా నిధులతో 22 ప్రధాన దేవాలయాలకు రహదారి వసతి కల్పిస్తున్నామని తెలిపారు. కోటప్పకొండ, వాడపల్లి సహా అనేక క్షేత్రాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం గిరిప్రదక్షిణ మార్గంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని చెప్పారు. అరుణాచలం తరహాలో ప్రతి పౌర్ణమికీ శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించాలని నూతన పాలక మండలికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఇతర అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# 'వందేమాతరం' పూర్తి గీతాన్ని పంచుకున్న విజయసాయిరెడ్డి... కీలక వ్యాఖ్యలతో ట్వీట్!

విదేశీ మతాలు మన మధ్యే మిగిలిపోయాయి. అవి మన సంస్కృతిపై పరిపాలన చేయాలని చూస్తున్నాయి. భారతదేశంలో పుట్టిన మనకు మనసు ఉండదా? ఇప్పటికీ బానిసత్వపు సంకెళ్లేనా?" అని ప్రశ్నించారు.

గత 120 సంవత్సరాలుగా విదేశీ మతాల వారు ఏమనుకుంటారోనన్న భయంతోనే సగం 'వందేమాతరం' గీతాన్ని పాడామా..? అని ఆయన నిలదీశారు. "మన జాతీయ గేయంలో మన అమ్మవార్ల పేర్లు ఉండకూడదా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మార్చి, పూర్తి 'వందేమాతరం' గీతాన్ని పాడాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని విజయసాయిరెడ్డి కోరారు.

# గుంటూరు నుంచి విజయవాడకు 6 గంటలా? ప్రజలు నరకం అనుభవించాలా?: చంద్రబాబు

ప్రజలు నరకం అనుభవించాలా? జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం సున్నితమైన సమస్య. దీనిపై ఎక్కువ మాట్లాడకూడదనుకున్నా. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. వేంకటేశ్వరస్వామి విషయంలో తెలిసి కానీ.. తెలియక కానీ తప్పు చేయను. నిద్ర రానప్పుడు ఆయన్ను తలచుకుంటే వచ్చేస్తుంది. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను ప్రక్షాళన చేశాం.

**హెరిటేజ్‌కు ఏం సంబంధం?**

తిరుమల లడ్డూ కల్తీకి.. హెరిటేజ్‌కు ఏం సంబంధం? ప్రభుత్వం నుంచి ఆ సంస్థ ఒక్క పైసా కూడా అడగలేదు. పత్రిక ఉంది కదా అని పెద్ద హెడ్‌లైన్లు పెడుతున్నారు. వాళ్ల ఉద్దేశం బ్రాండ్ దెబ్బతీయడమే. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందనేది వాళ్ల భావన" అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది: నారా లోకేశ్

శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.

ముందుగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, విపక్ష నేత బొత్స సత్యనారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న కాంటీన్లు మూసివేయబోమని సభలో చెప్పి మాటతప్పారని, ఇప్పుడు వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవంటూ నీతులు చెబుతున్నారని అన్నారు.

దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవని చెబుతున్నారని, 2020- 2021 ఏడాది క్యూ-4 పెండింగ్ 683.1 కోట్లు, 2023-24 క్యూ-2, క్యూ-3, క్యూ-4 బకాయిలు 1753.98 కోట్లు, 2023-24 ఏడాది గమనిస్తే ఎంటీఎఫ్ ఎరియర్లు సుమారు రూ.895 కోట్లు బకాయిలు పెట్టారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించినట్లు సభ్యులు చెబుతున్నారని, ప్రభుత్వం మారే సమయంలోనూ రూ.645 కోట్ల బకాయిలు చెల్లించలేదని అన్నారు.

తాను ఈ విషయాలను పూర్తి ఆధారాలతో చెబుతున్నానని లోకేశ్ అన్నారు. విద్యాశాఖ మంత్రిగా మాట్లాడేందుకు తనకు హక్కు ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై బొత్స స్పందిస్తూ, వైసీపీ హయాంలో రూ.4 వేల కోట్ల బకాయిలు లేవని, రెండు వాయిదాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇంటర్ విద్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు చెప్పారు.

**వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం**

వైసీపీ వాకౌట్ చేయడంపై నారా లోకేశ్ స్పందించారు. "నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్ధాలు చెప్పి బయటకు వెళుతున్నారు. ఇంటర్ విద్యపై దృష్టి పెట్టడం లేదంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 70 వేల మంది విద్యార్థులు పెరిగారు. అదీ ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పుస్తకాలు, బ్యాగ్స్ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం రద్దు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. మేం ఇంటర్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. పుస్తకాలు ఇస్తున్నాం. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వెళతారు. హాయిగా టీ తాగి ఆ తలుపు నుంచి వస్తారు" అని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి ఉంటే వైసీపీ మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సమాధానం ఇస్తున్నామని అన్నారు. సమస్యలు లేవని మేం చెప్పడం లేదన్నారు. వాటిని వినడానికి అలాగే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. పరదాలు కట్టుకుని తాము తిరగడం లేదని మంత్రి లోకేశ్ అన్నారు. ఇప్పుడు అసెంబ్లీకి ముఖ్యమంత్రి వస్తుంటే ప్రజలు నవ్వుతూ చేతులు ఊపుతున్నారని, గత ముఖ్యమంత్రి మాత్రం రోడ్లపై 3వేల మంది పోలీసులను పెట్టేవారని ఎద్దేవా చేశారు. నాడు యుద్ధవాతావరణం ఉండేదని అన్నారు. ఇప్పుడు ప్రజలు ప్రశాంతంగా, హాయిగా తిరగగలుగుతున్నారని, ఇదీ తమ చిత్తశుద్ధి అన్నారు. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని, విపక్ష నేతను పిలిపించాలని అన్నారు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారని విమర్శించారు. ప్రశ్నించే హక్కు తనకు ఉందని, వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# ఐటీ రాబడి పెరగడమంటే భారం మోపినట్లు కాదు: నిర్మల

ద్రవ్యోల్బణం చరిత్రాత్మక స్వల్పస్థాయిలో ఉందని, యూపీయేలో మాత్రం 'ఉద్యోగాల్లేని వృద్ధి' ఉండేదని చెప్పారు.

**అది ట్రేడ్ బిల్లు కాదు ట్రాప్ బిల్లు**

అమెరికాతో కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద (ట్రేడ్) బిల్లును బోనులో బంధించేసే (ట్రాప్) బిల్లుగా విపక్షం అభివర్ణించింది. దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్నారని విమర్శించింది. పార్లమెంటు మకరద్వారం వద్ద ఈ మేరకు నిరసన తెలిపింది. దీనిలో రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, వివిధ పార్టీలకు చెందిన టి.ఆర్.బాలు, ధర్మేంద్ర యాదవ్, జయాబచ్చన్ తదితరులు పాల్గొన్నారు. 'కార్మిక సంఘాల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం తదితరాల స్థానంలో రూపొందించిన 'పారిశ్రామిక సంబంధాల కోడ్ (సవరణ) బిల్లు'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో విపక్ష సభ్యులు మాట్లాడుతూ.. కార్మికుల కంటే పారిశ్రామికవేత్తలకే ప్రభుత్వం అనుకూలంగా ఉంటోందని విమర్శించారు. కార్మికులకు రక్షణ కొరవడుతోందన్నారు. ఇదొక చరిత్రాత్మక బిల్లు అని అధికారపక్షం పేర్కొంది.

# నాకు కొన్ని విషయాలు వినపడవు

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, మంత్రి అనగాని సత్యప్రసాద్ మధ్య బరువు తగ్గడంపై జరిగిన చర్చ నవ్వులు పూయించింది. అసెంబ్లీ లాబీలో మంత్రి అనగానితో మాట్లాడుతున్న బాలకృష్ణ, అటుగా వచ్చిన బొజ్జల సుధీర్ రెడ్డిని చూపిస్తూ.. "బొజ్జల సుధీర్ రెడ్డి బరువు తగ్గానంటున్నాడు, మీకేమైనా తేడా కనిపిస్తుందా?" అని సరదాగా ప్రశ్నించారు. దీనికి బొజ్జల స్పందిస్తూ, "అన్నాయ్, ఇప్పటికే 15 కిలోలకు పైగా తగ్గాను, ఇంకా తగ్గమంటావా?" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. వెంటనే బాలకృష్ణ తనదైన శైలిలో.. "ఇంకా తగ్గకు, మళ్లీ నాకు పోటీ వస్తావ్" అంటూ ఛలోక్తి విసరడంతో అక్కడ నవ్వులు విరిశాయి. ఈ క్రమంలో బొజ్జల బదులిస్తూ.. "ప్రజలు మిమ్మల్ని, లోకేశ్ గారిని ఒకే ఫ్రేమ్‌లో చూడాలని అనుకుంటున్నారు" అని బాలకృష్ణతో అన్నారు. ఈ రాజకీయ ప్రస్తావనకు బాలకృష్ణ అంతే చమత్కారంగా.. "నాకు కొన్ని విషయాలు వినపడవు" అని బదులిచ్చి అక్కడి నుంచి ముందుకు సాగారు.

# నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు: సీడీఎస్

ఈ క్రమంలోనే 1954లో టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించింది. పంచశీల ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి" అని సీడీఎస్ చౌహాన్ వివరించారు.

**బంగ్లా పీఠంపై 'డార్క్ ప్రిన్స్'.. భారత్‌తో స్నేహమా? రణమా?**

పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో భారత్-చైనాల మధ్య 1954లో పంచశీల ఒప్పందం (ఐదు సూత్రాలు) జరిగింది. నాటి భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్‌లైలు సంతకాలు చేశారు. అయితే, చైనా వైఖరి చూస్తుంటే ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమేనని అర్థమవుతోందని.. సరిహద్దు అంశంలో ఇది ఏమాత్రం ప్రతిబింబించలేదని సీడీఎస్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ.. హిమాలయ పర్వతాల్లోని వాస్తవాధీన రేఖ సున్నిత ప్రాంతంగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

# బాల కార్మిక వ్యవస్థను జిల్లాలోని అధికారులు పూర్తిగా నిర్మూలించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 13)

బాల కార్మిక వ్యవస్థను జిల్లాలోని అధికారులు పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బాల కార్మిక నిర్మూలన జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. బాల కార్మిక నిర్మూలన చట్టాలు పకడ్బందీగా అధికారులు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. బాపట్ల జిల్లాలో బాల కార్మికులు ఉండరాదన్నారు. బాల కార్మికుల వ్యవస్థ పూర్తిగా నిర్మూలించడమే అధికారుల లక్ష్యం కావాలన్నారు. రెస్క్యూ బృందాలు నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. 14 సంవత్సరాలలోపు బాలలంతా కచ్చితంగా పాఠశాలల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం పక్కాగా అమలు చేయాలన్నారు. గడచిన రెండు నెలలలో రెస్క్యూ బృందాలు నిరంతరం తనిఖీలు చేయడం ద్వారా 15 మంది బాలలకు విముక్తి కల్పించామన్నారు. వారిచేత వెట్టి చాకిరి చేయించుకుంటున్న యజమానులకు జరిమానాలు విధించి, బాలల కుటుంబాలకు పరిహారం అందించామన్నారు. నమోదైన 15 కేసులలో బాలలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. పాఠశాలల వయసు ఉన్న వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. లేదా ఒకేషనల్ పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. కళాశాలలో డ్రాప్ అవుట్స్ ఉంటే అలాంటి వారిని తిరిగి కళాశాలలో చేర్పించాలన్నారు. అర్హులైన వారందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీ చేయాలని ఆయన సూచించారు. బాలల హక్కులకు ఉల్లంఘన జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాలలు స్వేచ్ఛగా చదువుకునే అవకాశాలు కల్పించడమే చట్టాల ముఖ్య ఉద్దేశం అన్నారు. చట్ట ప్రకారం అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు దక్కుతాయన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి డి ఆర్ ఓ లవన్న, కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకట శివప్రసాద్, కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత రక్తపరీక్షలు నిర్వహణ

(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 13)



మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సురేంద్ర నగర్ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత రక్తపరీక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై శ్రీనివాసులు పర్యవేక్షణలో బెంగళూరులోని జాన్స్ మెడికల్ కళాశాల, హాస్పిటల్ సహకారంతో నిర్వహించారు. 14 నుండి 45 సంవత్సరాల వయస్సు గల బాలికలు మరియు మహిళలకు హీమోఫీలియా, సికిల్ సెల్ అనీమియా వంటి రక్త సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం ప్రత్యేక రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వై శ్రీనివాసులు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా రక్తకణాల ఆకృతి మరియు సంబంధిత లోపాలను ముందస్తుగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ వి జనార్ధనరావు, పాఠశాల ఇంచార్జి ఏ రామయ్య, ఉపాధ్యాయులు, మెడికల్ కాలేజ్ నుంచి వచ్చిన వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

14.02.26 శనివారం


# జిల్లా కోర్టు నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 13)

బాపట్లలో జిల్లా కోర్టు నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజా సానుకూల స్పందన, మహాశివరాత్రి ఉత్సవాలు, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, కోర్టు భవనాల స్థలాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఏపీ సచివాలయం నుంచి సిఎస్ శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి స్థాయి పెరగాలని సిఎస్ కోరారు. (తరువాయి 4లో...)

# రాష్ట్రమంతా ఓ రూల్....!

**పొదిలి శివాలయానికి మాత్రం మరో రూల్ కావాలంట...!!**

**సాధారణ భక్తులకు ప్రాధాన్యమివ్వాలన్న ముఖ్యమంత్రి**

**పొదిలి శివాలయంలో మాత్రం ఉభయదాతలకు ప్రత్యేక పాస్‌లు కావాలన్న ఆలయ ఛైర్మన్**

**ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిందేనన్న ఆలయ అధికారులు, పోలీసులు**

**ఉచిత దర్శన బోర్డులు ఏర్పాటు చేయకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేసిన డిఎస్పీ**





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 13)

మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏడాది విఐపి దర్శనాల పేరుతో సాధారణ భక్తులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు చెక్ పెట్టింది. ఆ దిశగా రాష్ట్రంలోనే ఏ శైవ క్షేత్రాల్లో కూడా విఐపి పాస్‌లు, సాధారణ పాస్‌లు ఏవీ కూడా జారీ చేయవద్దని దేవాదయశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సదరు పాస్‌లు జారీ చేయడం ద్వారా సాధారణ భక్తులు దేవుడని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వం గ్రహించి పాస్‌ల విధానాన్ని రద్దు చేసింది. అయితే పొదిలి శివాలయంలో మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించేందుకు ఆలయ కమిటీ తాపత్రయ పడుతుంది. తమ ఉభయ దాతలకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించాల్సిన బాధ్యత తమ పై ఉందని ఆలయ ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య చెబుతున్నారు.

ఇదే విషయమై శుక్రవారం పొదిలి నిర్మమహేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఏర్పాట్లును పరిశీలిం చేందుకు వచ్చిన కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్‌తో చర్చించారు. ఈ పాటికే ఆలయ ఈఓ పాస్‌ల జారీ విషయంలో తాము ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మాత్రమే నడుచుకుంటామని ఆలయ కమిటీకి స్పష్టం చేశారు. అయినా ఛైర్మన్ పోలీసులతో చర్చించి ప్రత్యేక పాస్‌లు జారీ చేసేందుకు ప్రయత్నం చేశారు. డిఎస్పీ సైతం తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే చేయగలని స్పష్టం చేశారు. కాని ఛైర్మన్ మాత్రం గత వైసీపీ ప్రభుత్వంలో పాస్‌లు జారీ చేశారని, ఇప్పుడు తాము పాస్‌లు జారీ చేయకపోతే ఉభయ దాతలు, ముఖ్య నేతల నుంచి తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సిన వస్తుందని డిఎస్పీతో తెలిపారు. కానీ పాస్‌ల జారీ విషయంలో తామేమీ చేయలేమని, ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని తెలియజేశారు. ఈ క్రమంలోనే ఆయన సాధారణ భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం చెబుతున్నా ఇప్పటి వరకు ఉచిత దర్శనాలు అనే బోర్డులు లేకపోవడం ఏమిటని ఆలయ అధికారులను ప్రశ్నించారు. సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సాధారణ భక్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు క్యూ లైన్‌లో వేచి ఉండే భక్తులకు మంచినీరు ఏర్పాటు చేయాలని, ఎలాంటి తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా చూడాలని ఆయన సూచించారు. భక్తుల రద్దీని అంచనా వేసి ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన ఆలయ కమటీ, ఆలయ అధికారులను కోరారు.

# ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ సరిగా పనిచేయ లేదు

**అర్జీలను పరిష్కరించ లేదు**

**1100 అర్జీలకు గాను 100 అర్జీలు మాత్రమే పరిష్కారం**

**మిగిలినవి చెత్తబుట్టల్లోకి...**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల సంచలన వ్యాఖ్యలు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 13)

రెవెన్యూ సమస్యల పరిష్కారం విషయంలో గతంలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొన్నటి వరకు పని చేసిన ఆర్ గోపాలకృష్ణ సక్రమంగా పని చేయలేదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకాశంజిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి 2,962 అర్జీలు వచ్చాయన్నారు. ఓ పది అర్జీలు మాత్రమే ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు వచ్చాయని తెలిపారు. తర్లుపాడు మండలంలో 860 అర్జీలు ఉంటే అన్నింటిని పరిష్కరించామని అధికారులు తెలియజేశారన్నారు. తర్లుపాడు మండలం పూతలపాడు రైతుల భూముల వివరాల్లో ఊరి పేరు పోతవరంగా మార్చబడిందన్నారు. దాంతో ఆ భూములు అన్ని దేవాదయశాఖవిగా మారడంతో రైతులు విక్రయించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారం పై రెవెన్యూ సదస్సుల్లో సుమారు 67 అర్జీలు ఇస్తే ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు చూపి అర్జీలను చెత్తబుట్టలో వేశారన్నారు. దీంతో పోతలపాడు గ్రామంలో ఓ రైతు ఆత్మహత్య కూడా చేసుకున్నాడని సభ దృష్టికి తీసుకెళ్ళారు. మార్కాపురం నియోజకవర్గంలో జరిగినన్ని ఘోరాలు, నేరాలు ఏ నియోజకవర్గంలో కూడా జరగలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 14 మంది విఆర్ఓలు, ఒక తహశీల్దార్ ఒకే సారి సస్పెండ్ అయ్యారన్నారు.

(తరువాయి 4లో...)

# వైసీపీ అస్తవ్యస్త విధానాలతో తప్పని ఇబ్బందులు

**రెవెన్యూ అర్జీల పరిష్కారంలో గందరగోళం**

**అర్జీల్లో 10 శాతం కూడా పరిష్కారం కాలేదు**

**ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు**

**అర్జీల పరిష్కారానికి స్పష్టమైన విధానం ఉండాలి**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గళం**



(షణ్ముఖ వెలుగు, పర్చూరు ప్రతినిధి, ఫిబ్రవరి 13)

వైసీపీ ప్రభుత్వ హయాంలో అవలంబించిన అస్తవ్యస్త రెవెన్యూ విధానాల ప్రభావం ఇప్పటికీ రాష్ట్రాన్ని వెంటాడుతోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో రెవెన్యూ సమస్యలపై జరిగిన చర్చలో ఆయన ప్రభుత్వ దృష్టికి పలు కీలక అంశాలను తీసుకువచ్చారు. గత పాలకుల నిర్ణయాలతో (తరువాయి 4లో...)

# వనరులు ప్రమోట్ చేస్తే అభివృద్ధి సాధ్యం

**అందుకే పాకలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం**

**మీడియా సమావేశంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 13)

జిల్లాలో ఉన్న వనరులను ప్రమోట్ చేస్తే పెట్టుబడులు వస్తాయని ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య వెల్లడించారు. అందులో భాగంగా నేషనల్ హైవే నుండి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకలలో ఈనెల 14, 15 తేదీలలో రెండు రోజులు పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీచ్ ఫెస్టివల్ కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గుజరాత్ తర్వాత అతిపెద్ద సముద్ర తీరం ఏపీలో ఉందన్నారు. పాకల బీచ్ ఫెస్టివల్ పై రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడటం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని బీచ్ ఫెస్టివల్ విజయవంతానికి (తరువాయి 4లో...)

# వినుకొండలో నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం ఘనంగా కృతజ్ఞత ర్యాలీ





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 13)

గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.1200 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేస్తూ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయంపై వినుకొండలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గ తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుండి స్తూపం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు విడుదల చేసిన లోకేష్‌కి ఈ సందర్భంగా నాయకులు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూసమస్యలను పరిష్కరించాలి

## జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కుక్కమూడి ప్రసాద్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల, ఫిబ్రవరి 13)

దుర్గి మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ తహశీల్దార్ వరకుమార్ ను కోరారు. శుక్రవారం దుర్గి తహశీల్దార్ కార్యాలయం నందు దుర్గి తహశీల్దార్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ మండలంలో నివేశ స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు కలిసి ఉంటున్నారాని దీనివల్ల ఆ కుటుంబ సభ్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ఈ మండలంలో భూ సమస్యలు చాలా పెండింగ్లో ఉన్న ఉన్నాయని పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అర్హులైన ప్రతి పేదవానికి ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, ప్రతి నెల మండలంలో జరిగే పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల నుండి అధికారులు హాజరయ్యేలా చూడాలని ఆయనను కోరారు. ఈ సమస్యల పై తహశీల్దార్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ అస్తవ్యస్త విధానాలతో తప్పని ఇబ్బందులు

ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ అర్జీల పరిష్కారంలో కొందరు అధికారుల తీరు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయన్నారు. దీనికి ఉదాహరణ అధికారులు వెల్లడించిన గణాంకాలే ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు.

**అర్జీల పరిష్కారానికి స్పష్టమైన విధానం కావాలి**

రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అర్జీల పరిష్కారంలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. సమస్య పరిష్కారమైందని రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల 33 వేల అర్జీలు అందగా, అందులో కేవలం వెయ్యి సమస్యలే నిజంగా పరిష్కారమయ్యాయని, మిగతావి పరిష్కారం కాకుండానే 'పరిష్కరించాం' అని నమోదు చేశారని ఆయన ఆరోపించారు. ఇది ప్రభుత్వాన్ని అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారనే సంకేతమని అన్నారు.

**అధికారుల నిర్లక్ష్యం వల్లే సమస్యలు**

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. అర్జీదారుడితో మాట్లాడకుండా, కేవలం ఒక సమాధానం ఇచ్చి ఫైల్ మూసివేయడం ద్వారా సమస్యను పరిష్కరించినట్టుగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల తరతరాలుగా సాగుతున్న భూ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**ఈనామ్ సెటిల్‌మెంట్ భూముల సమస్యపై ఆవేదన**

పర్చూరు నియోజకవర్గంలోని నాలుగు గ్రామాల్లో సుమారు 5,000 మంది రైతులు ఈనామ్ సెటిల్‌మెంట్ భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. అరెకరం, పావు ఎకరం, 10 సెంట్లు, 20 సెంట్లు వంటి చిన్నచిన్న భూములపై హక్కులు ఉన్న రైతులు గత రెండు సంవత్సరాలుగా పరిష్కారం కోసం తిరుగుతున్నా, స్పష్టమైన పురోగతి కనిపించలేదని పేర్కొన్నారు. రెవెన్యూ మంత్రిని 50 సార్లు ఆదికారులతో మాట్లాడినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**పర్చూరులో 10 శాతం కూడా పరిష్కారం కాలేదు**

పర్చూరు నియోజకవర్గంలో 839 రెవెన్యూ సమస్యలు పరిష్కరించామని అధికారులు నివేదికలో పేర్కొన్నప్పటికీ, వాస్తవానికి 10 శాతం కూడా పరిష్కారం కాలేదని ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు. కేవలం గణాంకాల పరంగా మాత్రమే పరిష్కారం చూపించి, ప్రజలకు ప్రయోజనం కలగలేదని అన్నారు.

**స్పష్టమైన విధానం లేకపోతే మార్పు కష్టమే**

ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, మంత్రి అనగాని సత్యప్రసాద్ సారథ్యంలో సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ, పూర్తి స్థాయి ఫలితాలు రావాలంటే స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అధికారుల్లో బాధ్యతాయుత వైఖరి లేకపోతే ప్రభుత్వం ఎన్ని మార్గదర్శకాలు జారీ చేసినా ప్రయోజనం ఉండదని హెచ్చరించారు.

**త్వరితగతిన పరిష్కారం కోరుతూ విజ్ఞప్తి**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విధానాన్ని రూపొందించి, గడువుతో కూడిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శక విధానాన్ని అమలు చేయాలని కోరారు. రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి, అర్జీదారులకు న్యాయం చేయడమే ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు.


# ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ సరిగా పనిచేయు లేదు

వారి వలన 350 ఎకరాల పైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటికి అర్జీలు ఇచ్చామే తప్ప నేటికీ పరిష్కారం కాలేదన్నారు. కొన్ని సమస్యలను జెసి పరిధిలో పరిష్కరించగలిగినవి ఇచ్చామన్నారు. దాదాపు 1100 ఫైల్స్ ఇస్తే ప్రకాశం జిల్లా జెసి కేవలం 100 అర్జీలు పరిష్కరించి మిగిలినవి చెత్తలో పడేశారన్నారు. రైతులు నేటికీ తమ ఇళ్ళు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. మా సమస్యలు పరిష్కరించండి అంటూ వేడుకుంటున్నారన్నారు. తీవ్రతరమైన సమస్యలను పరిష్కరించకుండా అధికారులు చేసిన తప్పిదాల వలన కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు కూడా ప్రజల్లోకి వెళ్ళకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. రీసర్వేలతో పేరుతో జాయింట్ ఎల్‌పిఎం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖ మంత్రి అధికారులకు అధికారాలు ఇచ్చినా వాటిని కూడా నేటికీ పరిష్కరించలేదన్నారు. వీలైనంత త్వరగా మార్కాపురం జిల్లాలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఆయన విన్నవించారు.

# వనరులు ప్రమోట్ చేస్తే అభివృద్ధి సాధ్యం

ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గిద్దలూరులో వాల్ పోస్టర్ ని ఆవిష్కరించి పాకల బీచ్ ఫెస్టివల్ ఉద్దేశాలను తెలియజేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గం లో అవగాహనా కల్పిస్తూ 2కే రన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా చరిత్రలో నిలిచిపోయే విధంగా పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు వినోదం, ఉల్లాసం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇలాంటికార్యక్రమాలు చేపడుతున్నారని, బీచ్ ఫెస్టివల్ లో వాటర్ స్పోర్ట్స్ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అనేక వినోద కార్యక్రమాలు ఉంటాయని బీచ్ అందాలను తిలకించేందుకు హెలికాప్టర్ రైడ్ కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్ లో జిల్లా ప్రజలందరూ పాల్గొనాలని దామచర్ల సత్య పిలుపునిచ్చారు.

# శివరాత్రి పర్వదినం సందర్భంగా గీతాంజలి విద్యార్థుల మానవహారం



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 13)

స్థానిక వెన్నపూస కాలనీ నందు గల గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు శివరాత్రి పర్వదినం సందర్భంగా చేసిన మానవహారం విశేషంగా చూపరులను అల్లరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి తేళ్ళ కృష్ణవేణి మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఇష్టమైన పండుగలలో శివరాత్రి ఒకటి అని అట్టి పార్వదినాన్ని చిన్నారుల ఆనందం కోసం మరియు దాని ప్రత్యేకతను చిన్నారులకు తెలియచేయాలి అనే సదుద్దేశంతో నిర్వహించడం జరిగింది అని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండంట్ యేండ్లూరి లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయించాలి

ఆ దిశగా లోపాలను సవరించుకుంటూ అధికారులు పనిచేయాలన్నారు. ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై దృష్టి సారించాలన్నారు. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్లలో జిల్లా కోర్టు ఏర్పాటుకు 2.8 ఎకరాల భూమిని గుర్తించి, కేటాయింపునకు సిద్ధంగా ఉంచామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, సిఎస్ విజయానంద్ దృష్టికి తీసుకువెళ్లారు. బాపట్ల పట్టణంలోని భూమిని సిద్ధం చేశామని, ఈ విషయంపై జడ్జి తోనూ మాట్లాడామన్నారు. ప్రభుత్వ భూమికి ఎలాంటి సమస్య లేదని సిఎస్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ఇన్చార్జి డిఆర్ఓ లవన్న, ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి జుబేర్, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## రాష్ట్రోపాధ్యాయ సంఘం

## జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 13)

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గవిని శివశంకర్ మాట్లాడుతూ 11వ పీఆర్సీ గడువు పూర్తయి 30 నెలలు గడవినా ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కారణంగా రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వేమా శేషు, జిల్లా నాయకులు ఆదినారాయణ, మహబూబ్ జాన్, కే వెంకటేశ్వర్లు, వి రమేష్, జి మాధవరావు, టి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.





# ప్రమాదానికి గురైన పచ్చాకు ముఠా కూలీలను ఆదుకోవాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 13)

ఆటో ప్రమాదానికి కాళ్లు చేతులు విరిగిన పచ్చాకు ముఠా కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రిమ్స్ వైద్యశాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు చీమకుర్తి మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి దుడ్డు వెంకటరావు తదితరులు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం చీమకుర్తి పట్టణానికి చెందిన 20 మంది కూలీలు రెండు ఆటోలలో పొన్నలూరు మండలం ఉప్పలదిన్నె గ్రామంలో పచ్చాకు పని చేసేందుకు వెళుతుండగా చీమకుర్తి మండలం గోనుగుంట వద్ద ఒక ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురైందని తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురుకి తీవ్ర గాయాలు కాగా, మరొక ఐదుగురికి దెబ్బలు తగిలాయని తెలిపారు. వీరిలో సెగ్గం శ్రీనివాసరావుకు రెండు చేతులు, పక్కఎముకలు, కాలర్ బోను విరిగాయని తెలిపారు. నూతలపాటి అక్కమ్మకు కాలు చెయ్యి విరిగిందని వీరిద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని మెరుగైన వైద్యానికి నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పిస్తున్నట్లు తెలిపారు. పచ్చాకు ముఠా కూలీల ఆటోలు ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలకు గురవుతున్నాయని, వాటికి తగిన ఇన్సూరెన్స్ లేకపోవడం, ఇతర కారణాల రీత్యా ఈ వాహనాలలో ప్రమాదాలకు గురవుతున్న కూలీలకు ఎటువంటి రక్షణ అందటం లేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నారు. పొగాకు ఉత్పత్తి ద్వారా, ఎగుమతుల ద్వారా ప్రభుత్వాలకు వివిధ రూపాల్లో కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నదని, దాన్ని పొందుతున్న ప్రభుత్వాలు ఆ ఉత్పత్తికి కారుకులైన పేదలకు కనీస సౌకర్యం, రక్షణ కల్పించకపోవడం అన్యాయమని వారు అన్నారు. ఈ ప్రమాదానికి గురైన కూలీలకు వీరి చేత పని చేయించుకుంటున్న రైతులైనా మానవతా దృక్పథంతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు ఇటువంటి ప్రమాదాలను అరికట్టేందుకు, కూలీలకు రక్షణ చట్టం సాధించేందుకు ఇప్పటికైనా స్పందించాలని కోరారు.



## శివాలయాన్ని సందర్శించిన డిఎస్పి భద్రత్ర ఏర్పాట్లు పరిశీలన

### స్వామి వారికి ప్రత్యేక పూజలు ఏర్పాట్ల పై ఆరా









(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 13)

పొదిలి శ్రీ నిర్మమహేశ్వరస్వామి వారిని కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ శుక్రవారం సందర్శించారు. మహా శివరాత్రి సందర్భంగా భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రథోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రద్దిని తట్టుకునేందుకు ఆలయ సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. శాంతి భద్రతలకు ప్రత్యేక టీములు నిరంతరం పర్యవేక్షించే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమీటి ఆధ్వర్యంలో డిఎస్పి కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, సిఐ రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్, పోలీసు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీ ఒక నేరం

## మనిషి వస్తువు కాదు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 13)

బాండెడ్ లేబర్ సిస్టం (అబోలిషన్) యాక్ట్, 1976 చట్టం అమల్లోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ శాఖల సమన్వయంతో న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెట్టి విమోచన కూటమి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు వెట్టి చాకిరి నిర్మూలనపై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పాల్గొని మాట్లాడుతూ వెట్టిచాకిరీ అనేది మానవ హక్కులకు విరుద్ధమైన నేరమని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకుని సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడాలని అన్నారు. కనిగిరి మండల విద్యాధికారి నారాయణరెడ్డి, పిసిపల్లి ఎంఈఓ శ్రీనివాసచారి మాట్లాడుతూ ఎవరైనా బలవంతపు శ్రమకు గురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వెట్టి చాకిరి నిర్మూలనకు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు, బాలల అక్రమ రవాణాను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ చెపట్టిన కార్యక్రమాలు గురించి అవగాహన కలిగించారు. వెట్టి విమోచన కూటమి కనిగిరి డివిజన్ కన్వీనర్, పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులే భవిష్యత్ సమాజ నిర్మాతలు అని వారు సమానత్వం, న్యాయం విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వెట్టి చాకిరి నిర్మూలనపై చైతన్యం పెరిగిందని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పల్లా కోటి రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీని సందర్శించిన కొరిశపాడు విద్యార్థులు

### స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రి గొట్టిపాటితో భేటీ





(షణ్ముఖ వెలుగు, పర్చూరు ప్రతినిధి, ఫిబ్రవరి 13)

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను వీక్షించేందుకు ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం, తమ్మవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యార్థులలో రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇలాంటి సందర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన చట్టసభలు ఎలా పనిచేస్తాయి, ప్రజల సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి అనే అంశాలను ప్రత్యక్షంగా చూడటం ద్వారా విద్యార్థులకు మంచి అవగాహన కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారిని ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని ఆకాంక్షించారు. తమ నియోజకవర్గ మంత్రి సమక్షంలో అగ్రనేతలను కలవడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 13)

జిల్లాలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేలా వైద్య అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో బాలల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా రూపొందించిన "బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష" వాహనాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేలా వైద్య అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. బాలల ఆరోగ్యం రాష్ట్ర భవిష్యత్తుకు పునాదని తెలిపారు. గ్రామీణ, దూర ప్రాంతాల్లోని చిన్నారులకు రక్తహీనత, పోషకాహార లోపం, కంటి, దంత సంబంధిత సమస్యలను గుర్తించడం, అవసరమైన మందులు, సలహాలు అందించడం సమయానుకూల వైద్య సేవలు అందించేందుకు ఈ ఆరోగ్య రక్ష వాహనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక వైద్య సిబ్బంది, నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు ఈ వాహనంతో కలిసి సేవలు అందిస్తారని, బాలల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, వైద్య అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఎస్ఐని కలిసిన టీడీపీ నేతలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 13)

పొదిలి ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూరెడ్డి రాజేష్‌ను శుక్రవారం పొదిలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పూల బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించి స్వీట్లు అందజేశారు. ఎస్ఐని సత్కరించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాదాలవారిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాష, శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, మాజీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, పొదిలి పట్టణ మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ ఖాశీం, ఎస్సీ సెల్ అధ్యక్షులు గాలిముట్టి నరసింహారావు, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు ముక్కర కిరణ్ కుమార్, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, సోమిశెట్టి చిరంజీవి, సామి రాజా, ఇతర నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.












## కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసీపీకి లేదు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 13)

కూటమి ప్రభుత్వంపై స్థానిక వైసిపి నేతలు చేసిన వ్యాఖ్యలపై వినుకొండ నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు ఘాటుగా స్పందించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన పాలన, ఆర్థిక పరిస్థితుల పై వైసిపి నాయకులు ముందుగా సమీక్ష చేసుకోవాలని, ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వారికి లేదని పేర్కొన్నారు. చీఫ్ విప్ జీవి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధి ఒకే వ్యక్తి హయాంలోనే జరిగిందన్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమన్నారు. నాటి పులుపుల వెంకట శివయ్య నుండి నేటి వరకు అనేక మంది ప్రజాప్రతినిధులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. పంచాయతీ కాలంలో అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, త్రాగునీటి సమస్యల పరిష్కారం చేపట్టినట్లు వివరించారు. స్థానిక ఎన్ఎస్పి స్థలం 27 ఎకరాలను జీవి ఆంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రాష్ట్ర అనుమతులు తీసుకువచ్చి మున్సిపాలిటీకి బదలాయించినట్లు తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఆ స్థలంలో గణనీయమైన నిర్మాణాలు చేపట్టలేదని విమర్శించారు. ప్రస్తుత పాలనలో అభివృద్ధి పనులకు అనుమతులు పొందడంతో పాటు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. కొన్ని భూవ్యవహారాలు, మున్సిపల్ నిధుల వినియోగంపై కూడా నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. పట్టణ త్రాగునీటి శాశ్వత పథకానికి రూ.210 కోట్లు మంజూరు చేయించగా, టెండర్ల ప్రక్రియ వేగవంతమైందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీల అమలులో కట్టుబడి ఉన్నారని పేర్కొంటూ, పెన్షన్ పెంపు మరియు సంక్షేమ పథకాల అమలును ప్రస్తావించారు. స్త్రీ శక్తి పథకం, మూడు గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. పట్టణ డ్రైనేజీ వ్యవస్థ కూడా మెరుగుపడిందని అన్నారు. వైసిపి నేతలు చౌకబారు విమర్శలు మానుకుని వాస్తవాలను గుర్తించాలని, ప్రజల సమస్యలపై నిర్మాణాత్మక వైఖరి అవలంబించాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, పత్తి పూర్ణ, పి దాసయ్య, గంధం కోటేశ్వరరావు, బొంకూరి రోశయ్య, ఆర్ వీరాంజనేయరెడ్డి, సౌదాగర్ జానీ భాష, హనుమాన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## క్విస్ కళాశాలలో క్రిప్టోగ్రఫీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ బూట్ క్యాంప్

### రెండు రోజుల పాటు ప్రత్యేక వర్క్ షాప్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 13)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రిప్టో గ్రఫీ, నెట్ వర్క్ సెక్యూరిటీ బూట్ క్యాంప్ ప్రారంభమైనట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. రెండు రోజుల పాటు ఈ బూట్ క్యాంప్ జరగనుంది. ఈ బూట్ క్యాంప్‌లో వివిధ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిక్షణలో క్రిప్టోగ్రఫీకి సంబంధించిన ప్రాథమిక, ఉన్నత స్థాయి అంశాలను విద్యార్థులకు బోధిస్తారు. ముఖ్యంగా ఎన్‌క్రిప్షన్ పద్ధతులు, డిజిటల్ సంతకాలు, హాషింగ్ అల్గారిథమ్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ తదితర అంశాలను వివరించారు. ప్రాయోగిక శిక్షణ సెషన్ల ద్వారా విద్యార్థులు ఎన్‌క్రిప్షన్ టూల్స్, నెట్‌వర్క్ మానిటరింగ్ టెక్నాలజీ, వల్నరబులిటీ అసెస్‌మెంట్ పద్ధతులపై ప్రాక్టికల్ గా తెలుసుకోనున్నారు. అకడమిక్ ఎడ్యుకేషన్, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ఇలాంటి వర్క్ షాప్ లు ఎంతగానో ఉపయోగపడతాయని ఐటీ డిపార్ట్మెంట్ హెచ్ వోడీ డాక్టర్ సెంథిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు కల్పించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 13)

అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఇ-శ్రమ పోర్టల్ అమలు తీరు, కార్మిక శాఖ పన్నుల వసూళ్లపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. ఈ-శ్రమ పోర్టల్ లో కార్మికులందరి పేర్లు నమోదు చేయించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో 3.54 లక్షల మంది కార్మికులను ఇ-శ్రమ పోర్టల్ లో చేర్పించాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.93 లక్షల మంది వివరాలు నిక్షిప్తం చేశామన్నారు. గడచిన ఐదు నెలలలో 12,303 మంది కార్మికుల వివరాలను పొందుపరిచామన్నారు. ఇ-శ్రమ పోర్టల్ లో కార్మికుల పేర్లు నమోదు ప్రక్రియలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. లక్ష్యాలు చేరుకునే వరకు ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా 300 మంది కార్మికులను ఇందులో చేర్చాలన్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయాల సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియను వేగంగా చేపట్టాలన్నారు. 18 నుంచి 50 సంవత్సరాలలోపు కార్మికులందరిని ఇ-శ్రమలో చేర్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలను ఇ-శ్రమ పోర్టల్ లోకి చేర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలను డిఆర్డిఏ అధికారులు చేర్చాలని, పట్టణాలలో పొదుపు మహిళలు, వీధి వ్యాపారులు, రిక్షా కార్మికులను మెప్మా సిబ్బంది నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను డీఈవో, అంగన్వాడి కార్యకర్తలను మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి, వ్యవసాయ కూలీలను వ్యవసాయశాఖ అధికారులు, మత్స్య కార్మికులను మత్స్యశాఖ, హమాలీలను పౌరసరఫరాల శాఖ, చేనేత కార్మికులను చేనేత జౌళి సంక్షేమ, వివిధ రంగాలలోని కార్మికులను కార్మిక శాఖ అధికారులు జోడించాలన్నారు.

**సంక్షేమ ఫలాలు అందించేందుకు పన్నులు పక్కాగా వసూలు చేయాలి**

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించడానికి పన్నులు పక్కాగా వసూలు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యుఎస్ (గ్రామీణ నీటి సరఫరా విభాగం), మున్సిపాలిటీలలో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులపై చట్ట ప్రకారం పన్నుల రూపంలో రూ.1.25 కోట్లు కార్మిక శాఖకు వచ్చిందన్నారు. మున్సిపాలిటీలలో చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ రకాల పన్నుల ద్వారా కార్మిక శాఖకు రూ.13.33 కోట్లు వచ్చాయన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలలో చేపట్టిన 8,904 పనులకు గాను పన్నుల రూపంలో రూ.10.06 కోట్లు వసూలు జరిగాయన్నారు. కార్మిక శాఖకు వచ్చిన పన్నులతో కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్మికులకు నైపుణ్య శిక్షణలు ఇవ్వడం, వివాహాల సమయంలో కార్మికులకు ప్రోత్సాహక పథకం, కార్మికులైన గర్భిణులకు ఆర్థిక సహాయం, ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు పరిహారం అందించాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డిఆర్ఓ లవన్న, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ వెంకట శివప్రసాద్, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ వై రామకృష్ణ, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, గుంటూరు, ప్రకాశం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోలు కృష్ణ, బాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి పండుగ రోజులలో అధికారులు బాధ్యతతో పని చేయాలి

### శ్రీ బాల కోటేశ్వర సామి వారిని భక్తులకు ప్రశాంతంగా దర్శించుకోవాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్









(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 13)

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శివ భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా దర్శనం చేసుకొని విదంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రేపల్లె రెవిన్యూ డివిజన్, రేపల్లె మండలం, ఆరవపల్లి గ్రామం నందు ఉన్న శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మహాశివరాత్రి పండుగకు ముందస్తు ఏర్పాట్లు పై ఆలయ కమిటీ సభ్యులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా శ్రీ బాలకొటేశ్వర స్వామి వారిని దర్శించుకొనేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా 65 శివాలయాలలో ఉత్సవాలు జరుగుతాయని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లును శనివారం ఉదయం కల్లా పూర్తి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాలలో పూజా కార్యక్రమాల కొరకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరితే సురక్షితమైన విధానంలో క్రమబద్ధంగా నియంత్రణ చేయాలన్నారు. ప్రతి ఆలయంలో క్యూ పద్ధతిని అమలు చేయాలన్నారు. అలాగే విగ్రహాల భద్రత, దొంగతనాలు, తొక్కిసలాటు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలు అధికంగా వచ్చే ఆలయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగితే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ కి సమాచారం ఇవ్వాలన్నారు. 5 వేల నుంచి ఒక లక్ష జనాభా హాజరయ్యే శివాలయాలు ఆరు ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. అమర్తలూరు మండలంలో గోవాడ గ్రామం, రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో బాల కోటేశ్వర స్వామి దేవాలయం, చిన్నగంజాం మండలం సోపిరాల గ్రామం, చిన్నగంజాం మండలం బాలకోటేశ్వర స్వామి దేవాలయం, చండూరు మండలం బాలకోటేశ్వర స్వామి దేవాలయం కొల్లూరు మండలం కోటిపల్లి శివాలయాలకు అత్యధిక సంఖ్యలో జనాభా వస్తారన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్లు, ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గోళ్ళ సంయుక్త జన్మదిన సందర్భంగా విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 13)

మార్కాపురం పట్టణానికిచెందిన గోళ్ళ హరీష్ కుమార్ తన ప్రథమ పుత్రిక అయిన సంయుక్త జన్మదిన సందర్భంగా తర్లుపాడు మండలంలోని జగన్నాధపురం గ్రామపంచాయితీలో గల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులకు రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని లీటర్, వాటర్ బాటిల్, బిస్కెట్, ప్యాకెట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కశ్శెట్టి వెంకట జగన్ బాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో వ్యాపారం చేస్తూ వారు ఇరువురి స్నేహ సంబంధాన్ని గుర్తుచేసుకొని తన పిలుపు మేరకు ఆయన స్నేహితుడైన గోళ్ళ హరీష్ కుమార్ కుమార్తె సంయుక్త జన్మదిన సందర్భంగా మీ పాఠశాల విద్యార్థులకు ఏమి కావాలని కోరగా అందుకు సమాధానంగా ప్రధానోపాధ్యాయుడు జగన్‌బాబు విద్యార్థులకు వాటర్, బాటిళ్లను ఇచ్చినట్లయితే ఉపయోగపడుతుందని చెప్పగానే వెంటనే హరీష్, కుమార్, స్పందించి కంపెనీ బ్రాండ్, బాటిల్లను ఏర్పాటు చేశారన్నారు. హరీష్ కుమార్‌కు పిల్లల పట్ల ఉన్న ప్రేమ, అభిమానాన్ని చాటారన్నారు. దీంతో ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సమాజంలో తమ వంతుగా ఏదో ఒక రకంగా సహాయం చేస్తూ వారి ధార్మికతను చాటుకోవాలన్నారు. ఇలాగే ప్రతి ఒక్కరు ఈయనను స్ఫూర్తిగా తీసుకొని వారి వారి స్థాయిని బట్టి ఇతరులకు తమవంతుగా సహాయ, సహకారాలు అందించాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా కోకివారి ప్రభ ఊరేగింపు

### మహాశివరాత్రి ఉత్సవాలకు కోకివారి ప్రభతో అంకురార్పణ

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 13)

జిల్లాలో పవిత్రమైన చారిత్రక క్షేత్రాలలో ప్రసిద్ధమైన300 సంవత్సరాల చరిత్ర గల అతి ప్రాచీన శైవక్షేత్రంమైన బాలకోటేశ్వరాలయం నందు ఫిబ్రవరి 15న జరగనున్న శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం మున్నంవారిపాలెం నూండీ కోకివారి ప్రభ ఊరేగింపుతో మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. కైలాశాధినేత అయిన ఆ మహా శివుడు బాలకోటేశ్వరుడు కొలువైన బాలకోటేశ్వర దేవలయానికి గత వందల సంవత్సరాల నుండి స్వామి వారికి ప్రథమ పూజ అర్హులు అయిన మున్నంవారిపాలెం కోకి వంశీకులు రంగు రంగుల దీపాలతో, పూలతో, అలంకారాలతో ప్రభను అలంకరించుకోని డప్పు వాయిద్యాల, కోలాహలలా మధ్య ఉత్సాహంగా కోత్తపాలెం, చిన్నగంజాం పురవీధుల్లో శోభాయమానంగా ఉరేగిస్తూ బాలకోటేశ్వరాలయం వద్దకు చేదుకో కోటయ్య మమ్మల్ని అదుకో, మమ్మల్ని ఏలుకో అంటూ శరణు ఘోషలతో చేరుకోవాటంతో శివరాత్రి సందడి ప్రారంభం అవుతుంది. దేవలయంకి చేరుకున్న ప్రభకు ముదు రోజులు పాటు ఘణంగా పూజలు నిర్వహిస్తారని కోకి వంశస్థులు తెలిపారు. ఈ ఊరేగింపు నందు కోకి వంశస్థులు, మున్నంవారిపాలెం కాపులు, యవకులు, అలయ కమీటి సభ్యులు పాల్గొన్నారు.

# పాకల బీచ్ ఫెస్టివల్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

భద్రత, ట్రాఫిక్, సముద్ర స్నానాల పై కట్టుదిట్టమైన పోలీసుల పర్యవేక్షణ

బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని

పోలీసు శాఖ జారీ చేసిన నియమాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి













(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 13)

ఈ నెల 14, 15 తేదీలలో సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా చేపట్టిన భద్రతా, ట్రాఫిక్, సముద్ర స్నానాల ఏర్పాట్లను ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజుతో పాటు జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య లు శుక్రవారం పరిశీలించారు. ఫెస్టివల్‌కు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని బీచ్ పరిసర ప్రాంతాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు మరియు కార్యక్రమాల వేదికల గురించి అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక మార్గాలు, వేర్వేరు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సముద్ర స్నానాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే స్నానాలకు అనుమతి ఇవ్వాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మెరైన్ సిబ్బంది, గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. అదనంగా ఫెస్టివల్ ప్రాంతమంతా సీసీటీవీ, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతుందని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, పిల్లల భద్రత కోసం ప్రత్యేక సిబ్బంది, గస్తీ బృందాలు నియమించామని తెలిపారు. పాకల బీచ్ ఫెస్టివల్ నందు వినోదాత్మక, జబర్దస్త్ ప్రోగ్రాం, హెలికాప్టర్ రైడ్, స్పీడ్ బోట్స్ రైడ్ వంటి ప్రత్యేక ఆకర్షణగా, వివిధ వంటలు, అనేక రకాల ఆకర్షణలు కలిగిన వెలుగులతో జరిగే ఈ పాకల బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు.

**14, 15 తేదీలలో పాకల బీచ్‌కు చేరుకొనే మార్గాలు**

**కావలి, కందుకూరు వైపు నుండి వచ్చే మార్గాలు:**

14, 15 తేదీల్లో జరుగనున్న పాకల బీచ్ ఫెస్టివల్‌కు కావలి, కందుకూరు వైపు నుండి వచ్చేవారు కలికివాయి సర్వీస్ రోడ్ ద్వారా సింగరాయకొండను చేరాలి. అక్కడ నుండి సింగరాయకొండలోని పాకాల రైల్వే గేట్ ద్వారా టిపి నగర్ మీదుగా పాకల గ్రామానికి చేరుకోవాలి.

**ఒంగోలు వైపు నుండి పాకలకు వచ్చే మార్గాలు**

ఒంగోలు వైపు నుండి వచ్చు వారు టంగుటూరు టోల్ ప్లాజా నుండి సర్వీస్ రోడ్ ద్వారా టంగుటూరు గ్రామంలోని రైల్వే అండర్ పాస్ నుండి టంగుటూరు గ్రామ పంచాయతి కార్యాలయం, పురం సెంటర్, అంబేద్కర్ నగర్, రావివారిపాలెం మీదుగా ప్రయాణించి పాకల బీచ్‌కు చేరాలి. కార్లు, బస్సులలో ప్రయాణించు వారు బకింగ్ హామ్ కాలువ ప్రక్కనుండి కుడి వైపు రోడ్డు నుండి ప్రయాణించి జనరల్ పార్కింగ్ చేరవలెను. మోటార్ సైకిల్ పై వచ్చువారు పాకల గ్రామం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుండి ఎడమ వైపు రోడ్డు నుండి ప్రయాణించి పార్కింగ్ ప్లేస్ కు చేరవలెను.

**పాకల బీచ్ కు వచ్చిన వారు తిరుగు ప్రయాణం**

తిరుగు ప్రయాణంలో పాకల నుండి చెల్లెమ్మ గారి పట్టపుపాలెం మీదుగా ఊళ్లపాలెం వచ్చి అక్కడ నుండి సింగరాయకొండకు చేరాలి. ప్రజలు పోలీస్ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించి, ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని, మీతోటి సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా నడుచుకోవాలని, మద్యం సేవించి సముద్రంలోకి వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. పాకాల బీచ్ ఫెస్టివల్‌ను సురక్షితంగా, ఆనందంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్‌శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112/100 నెంబర్లను సంప్రదించాలని ప్రజలను కోరారు.

# కనిగిరిలో మెగా టొయోటా సేల్స్ మేళా







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 13)

స్థానిక పామూరు రోడ్డులో టొయోటా మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా సేల్స్ మేళా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ పెరుగు మురళి కృష్ణ యాదవ్, డాక్టర్ నాయబ్ రసూల్ హాజరయ్యారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి సేల్స్ మేళాను అధికారికంగా ప్రారంభించారు. టొయోటా సంస్థకు చెందిన సరికొత్త మోడల్ కార్లను (అర్బన్ క్రూజర్ హైరైడర్) ఈ మేళాలో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలను స్థానికులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. వినియోగదారులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి టొయోటా సిబ్బంది, ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వాహనాల ఫీచర్లు, ఫైనాన్స్ సౌకర్యాల గురించి సిబ్బంది వినియోగదారులకు వివరించారు.

# పని ప్రదేశాలలో మహిళల పై లైంగిక వేధింపులను అరికట్టాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 13)

పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన కల్పిస్తూ సార్డ్స్ సంస్థ రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ శుక్రవారం విడుదల చేశారు. సంఘటిత, అసంఘటిత రంగాలలో పని చేసే మహిళలకు భద్రత కల్పించడం చాలా ముఖ్యమని కలెక్టర్ చెప్పారు. పదిమంది లేదా అంతకుమించి ఉద్యోగులు లేదా కార్మికులు పనిచేస్తుంటే ఆ ప్రాంతంలో అంతర్గత కమిటీలను నియమించాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపులు నివారణ, నిషేధం, పరిష్కార మార్గంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 2013లో రూపొందించిన ఈ చట్టాన్ని పక్కాగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని రొయ్యల ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలలో చట్టం పక్కాగా అమలు చేయాలన్నారు. ఎక్కడైనా మహిళలపై లైంగిక వేధింపులు వంటి ఏదైనా సంఘటనలు జరిగితే రాతపూర్వక ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి న్యాయం చేయాలన్నారు. నేర తీవ్రత అనుసరించి అధికారులు తనిఖీ, విచారణ చేయాలన్నారు. చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ... ప్రచారం చేయాలన్నారు. చట్టం ఉల్లంఘన జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకట శివప్రసాద్, మత్స్యశాఖ డిడి గాలి దేముడు, ఐసిపిఎస్ డిసిపిఓ పురుషోత్తం, సార్డ్స్ సంస్థ జిల్లా మేనేజర్ సుజిని, తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు

శివాలయాల భద్రత, ట్రాఫిక్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు కీలకమైన సూచనలు

ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా శివరాత్రి వేడుకలు జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 13)

మహాశివరాత్రి సందరంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శివాలయాలు, ఇతర దేవాలయాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జిల్లా ఎస్పీ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భద్రత, ట్రాఫిక్, పలు అంశాలపై సమీక్షించి పలు సూచనలు తెలియచేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రధాన శివాలయాలు ప్రాంతాల్లో జరిగే జాతరలు, ప్రత్యేక పూజలు, రాత్రి జాతర కార్యక్రమాలు వంటి వాటిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాల వద్ద అదనపు సిబ్బందిని మోహరించాలని, మహిళా భక్తుల భద్రత దృష్ట్యా మహిళా పోలీసులను నియమించాలని ఆదేశించారు. భక్తులు క్యూలైన్‌లో సజావుగా దర్శనం చేసుకోవటానికి బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, తోపులాటలు, గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ఎక్కువగా జరిగే కార్యక్రమాల సందర్భంలో ప్రత్యేక గస్తీ బృందాలను నియమించాలని, సీసీటీవీ, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆలయాల సమీపంలో తాత్కాలిక పార్కింగ్ ప్రదేశాలు గుర్తించి, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని, ప్రధాన రహదారుల పై ట్రాఫిక్ మళ్లింపులు చేయాలన్నారు. దర్శనానికి వచ్చే వారు భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విలువైన నగలు, మొబైల్ ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ప్రశాంత వాతావరణంలో భగవంతుని దర్శించుకునేలా జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో పొదిలి, త్రిపురాంతకం, భైరవకోన, మదనూరు, మొదలైన ప్రాంతలోన్ని ప్రముఖ దేవాలయాలు వద్ద శివరాత్రి ఉత్సవాలు మరియు రథోత్సవాలు జరుగుతున్నాయని, పండుగ ఉత్సవాలు, ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎక్కువ సిబ్బందితో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని, దోర్నాల – శ్రీశైలం ఘాట్ రోడ్డు లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, పూర్తి స్థాయి బందోబస్తుతో అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఏమైనా ఉంటే స్థానిక పోలీసు వారికి, 112/100 నంబర్లకు గాని తెలియపరచాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.



# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 13)

మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రమౌళి ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది మొత్తం కలసి ఇటీవల అలగాయపాలెం ఎస్సీ కాలనీలో ఆటో యాక్సిడెంట్ జరిగినటువంటి రెండు కుటుంబాలకు కొంత నగదు ఆర్థిక సాయం చేశారు. రావినూతల లక్ష్మి, రావినూతల బేబీ ప్రసన్న, వీరిద్దరికీ 11.500, అలగాయపాలెం టిడిపి నాయకులతో కలిసి ఈ నగదును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు

ePaper
www.shanmukhavelugu.com



## విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 13)

గోపవరం మండలం రాచాయపేటలో మోడల్ స్కూల్ హెడ్మాస్టర్ ప్రభలవీటి వెంకట రమణయ్య మనవడు మన్విత్ టి మొదటి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు5 తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక విందు అందించి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమానికి అతిథిగా రాచాయపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పలువురు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## తూర్పు కొప్పెరపాడులో రూ.4.5 కోట్లతో సబ్‌స్టేషన్ పనులకు శ్రీకారం

మంత్రి గొట్టిపాటి కృషితో సాకారం



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 13)

రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవ, సహకారంతో మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడులో విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి అడుగు పడింది. సుమారు రూ.4.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఘనంగా శంఖుస్థాపన నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా చేపట్టిన 200 సబ్‌స్టేషన్ల నిర్మాణంలో భాగంగా ఈ ప్రాజెక్టును మంజూరు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎనికపాటి శ్రీనివాసరావు, ఎనికపాటి అశోక్, పెంట్యాల సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు ఆంజనేయులు, సింగర్ నాయకులు గుర్రం శేఖర్, కుక్కపల్లి కొండలు, ఓబుల్ రెడ్డి, రావూరి రమేష్, కరి సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, వలి, పిచ్చిరెడ్డి, బాచిన సురేష్, పలువురు నేతలు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ ప్రాంత రైతులు, గృహ వినియోగదారుల దశాబ్దాల కలను నిజం చేస్తున్నారన్నారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లోవోల్టేజీ సమస్యలు తొలగి, రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఏడీ దామోదరం మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు అత్యున్నత ప్రమాణాలతో, యుద్ధ ప్రాతిపదికన ఈ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు.

## శ్రీశైలం పుణ్యక్షేత్రంలో పాగాలంకరణకు వ్యాఖ్యాతగా పొన్నూరుకి ఆహ్వానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 13)

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే పాగాలంకరణ మహోత్సవానికి తనకు వ్యాఖ్యాతగా ఆహ్వానం అందిందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఏశైవ క్షేత్రంలో జరగని విధంగా పాగాలంకరణ మహోత్సవం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మాత్రమే జరుగుతుందని అన్నారు. 15వ తేది శివరాత్రి రోజు అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాగాలంకరణ మహోత్సవం జరుగుతుందని అన్నారు. వరుసగా నాల్గవసారి తనకు పాగాలంకరణ మహోత్సవానికి వ్యాఖ్యాతగా అవకాశం కల్పించిన శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం శ్రీనివాసరావుకి, పాలకమండలి ఛైర్మెన్ పోతుగుంట రమేష్ నాయుడుకి తన కృతజ్ఞతలు తెలిపారు.

# పట్టణంలో మెరుగైన పోలీస్ సేవలు అందించాలి

బద్వేల్ సిఐ, ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు









(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 13)

బద్వేల్ అర్బన్ సిఐగా రామకృష్ణ, ఎస్ఐగా కొండారెడ్డి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఉదయం అర్బన్ సీఐ రామకృష్ణ, అర్బన్ ఎస్ఐ కొండారెడ్డిలను మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కెవి సుబ్బారావు, వార్త జర్నలిస్టు వల్లంకొండు వెంకటరమణ, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, సురేష్ లాడ్జి తుమ్మలపెంట సురేష్ బాబు, మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ మెంబర్ జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం), బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొలిశెట్టి పవన్ కుమార్, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, బలిజ సేవా సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్యతో పాటు పలువురు నాయకులు వ్యాపారస్తులు పుర ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించి ఫ్రూట్స్, స్వీట్ బాక్స్ అందజేసి వారికి అభినందనలు తెలియజేశారు. గతంలో బద్వేల్ పట్టణంలో అర్బన్ ఎస్ఐగా విధులు నిర్వహించారు. అయితే చాలా సంవత్సరాల తరువాత సిఐగా రామకృష్ణ మరోసారి ఇక్కడ బాధ్యతలు చేపట్టడంతో అందరికీ పరిచయస్తుడు కావడంతో పట్టణంలోని అనేక మంది మర్యాదపూర్వకంగా వారిని కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. బద్వేల్ పట్టణంలో ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విధంగా కృషి చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు, పలువురు పోలీస్ సిబ్బంది పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## చెక్కలతో వివిధ రకాల తయారీ

కార్మికుల జీవన విధానం తెలుకున్న కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్










(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 13)

పివిపాలెం మండలం రెడ్డిపాలెం రోడ్డు ప్రాంతంలో జీవనాధారం కోసం కొయ్యలతో వివిధ రకాల వస్తువులు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న 16 కుటుంబాలను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఉన్న కుటుంబ సభ్యులతో కలెక్టర్ స్నేహపూర్వకంగా వారితో మాట్లాడుతూ మీకు చెక్క కొయ్యలు ఎక్కడ నుండి తెచ్చుకుంటారు. ఎలాంటి వస్తువులు తయ్యారీ చేస్తారు. చెక్కలతో వివిధ రకాల తయారు చేసిన వస్తువులు పరిశీలించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెక్కతో, మంచాలు, బల్లలు, కుర్చీలు, పిల్లల ఆట వస్తువులు, అలంకరణ వస్తువులు, వంటింటి ఉపయోగ సాధనాలు వంటి పలు రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు వారు కలెక్టర్‌కు తెలిపారు. తయారు చేసిన వస్తువులను ఎక్కడ అమ్ముతున్నారు. రోజుకు సగటున ఎంత ఆదాయం వస్తుంది ని కలెక్టర్ ప్రశ్నించగా, స్థానిక మార్కెట్లు, సమీప గ్రామాలలో పండగలు, ఉత్సవాల జరుగుతున్న ప్రాంతాలలో విక్రయాలు చేస్తున్నామని, రోజుకు సగటున వచ్చిన పనిని బట్టి ఆదాయం మారుతుందని వివరించారు. పిల్లలను పాఠశాలకు పంపుతున్నారని కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. పిల్లల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలలో అన్ని రకాల మౌలిక సదుపాయాల అందుబాటులో ఉన్నాయిని మీ పిల్లలను బడికి పంపించి చదివించుకోవాలని సూచించారు. విద్య ద్వారా భవిష్యత్తు మెరుగుపడుతుందని వారికి అవగాహన కల్పించారు. ఇలాంటి సంప్రదాయ వృత్తులు కొనసాగిస్తున్న కుటుంబాలకు అవసరమైన ప్రభుత్వ పథకాలు, రుణ సౌకర్యాలు, మార్కెటింగ్ సహాయం అందించేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల తహశీల్దార్ డి వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, డిప్యూటీ యంపిడిఓ కె సుజాత, సంబంధిత శాఖల మండల అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు.

## మున్సిపల్ శాఖ డైరీని ఆవిష్కరించిన మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 13)

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యొక్క డైరీ కమ్ హ్యాండ్ బుక్ ను మార్కాపురం పురపాలక సంఘ కమీషనర్ నారాయణరావుచే ఆవిష్కరించడమైనది. సదరు కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నో ఏళ్లుగా మున్సిపల్ ఉద్యోగులకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నదని, అదేవిధంగా రానున్న రోజుల్లో కూడా ఈ యూనియన్ ప్రతి ఒక్క మున్సిపల్ ఉద్యోగికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఒక యూనియన్ గా మేమున్నాం అంటూ ఒక హామీని కల్పించినదిఅని అలాగే అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. కృష్ణ మోహన రావు, కార్యవర్గ సభ్యులు అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. సదరు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యొక్క ఆర్గనైజింగ్ సెక్రటరీ, మార్కాపురం మునిసిపల్ మేనేజర్ యు ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ షేక్ టపా ఖాదర్ వలి, మార్కాపురం పురపాలక సంఘ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపాల్‌రెడ్డి, రెవిన్యూ అధికారి షేక్ సోహిల్ అహ్మద్, మేనేజర్ శేఖర్ బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి కె శ్రీనివాసులు, శానిటరి ఇన్స్పెక్టర్ బి చెన్నకేశవులు, పురపాలక సంఘ సీనియర్ సహాయకులు శ్యామ్, విజయకుమార్, పద్మావతి వంశీ, జూనియర్ సహాయకులు తల్లమ్ ప్రసాద్, తాడి సత్యనారాయణ, గుమ్మా ప్రసాద్, పి వెంకటయ్య, కిరణ్, చప్పిడి శ్రీనివాసులు, వినయ్, కార్యాలయ సిబ్బంది, అందరూ కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ-స్కూటీ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 13)

పామూరులోని కందుకూర్ రోడ్డులో ద్వారక హోటల్ ఎదురుగా లారీ స్కూటీ ప్రమాదం గురువారం జరిగింది. దీంతో స్కూటీ పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. బాధితులను ఒంగోలుకు తరలించినట్లు సమాచారం.

## తెలుగుదేశం పార్టీకి రాజీనామా



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 13)

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టీడీపీ బూత్ కమిటీ మండల కో కన్వీనర్ చల్లా శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులు శుక్రవారం తెలుగుదేశం పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టింది మొదలు నలభై ఏళ్లకు పైగా గ్రామంలో చల్లా కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తూ పార్టీ విజయాల్లో తోడ్పాటు అందించామన్నారు. తన తాత, తండ్రి 40 ఏళ్ల పాటు సర్పంచ్ గా చేశారన్నారు. నేడు పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు, విలువ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు టీడీపీ పెద్దలు గ్రామంలో గ్రూపు రాజకీయం చేస్తూ పార్టీ కార్యకర్తల పై అక్రమంగా కేసులు పెటిస్తున్నారని వాపోయారు. గౌరవం, విలువలు లేని పార్టీలో ఉండలేనని, ఇప్పటికే తన రాజీనామా పత్రాన్ని పార్టీ పెద్దలతో పాటు ఐటీడీపీ యాప్‌లో కూడా పంపించానన్నారు. త్వరలో మరి కొంతమంది టీడీపీకి రాజీనామా చేస్తారని తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com